ఇళ్ల స్థలాలకు లైన్ క్లియర్

- ఫలించనున్న ముప్పై ఏళ్ల ఎదురుచూపులు
- 500 కుటుంబాల ఇళ్ల స్థలాలకు రానున్న అనుమతులు
- కోమన్‌పల్లి, డొంకేశ్వర ప్రజలు కష్టాలు తీరినట్లేనా..?


కోమన్‌పల్లి గ్రామం

సారంగాపూర్: ముప్పై ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం దొరికినట్లేనా.. ముంపు గ్రామాల ప్రజలకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు లైన్ క్లియర్ అయినట్లేనా అన్న దానిపై త్వరలో సమస్యకు ముగింపు పడే అవకాశం కనిపిస్తుంది...

మూడు గ్రామాల్లో ఎస్సారెస్పీ ముంపు ప్రజలకు భూముల కేటాయింపు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ముంపునకు గురై నష్టపోయిన వారికి ప్రభుత్వం 1977–78 సంవత్సరంలో బీర్‌పూర్ మండలం కోమన్‌పల్లి, డొంకేశ్వర్, మోతీనగర్ తదితర గ్రామాలను ఎస్సారెస్పీ ముంపు గ్రామాలుగా ఏర్పాటు చేసి దాదాపు 676 కుటుంబాలకు ఆయా గ్రామాల్లో ప్రభుత్వం నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములను కేటాయించి, వారికి అన్ని మౌలిక వసతులను కల్పించింది. ఇళ్ల నిర్మాణం చేపట్టి, వ్యవసాయానికి కేటాయించిన భూముల్లో వ్యవసాయ యోగ్యంగా మార్చింది. అయినప్పటికీ వారికి ఇక్కడి స్థానిక పరిస్థితులు నచ్చకపోవడంతో దాదాపు 30 ఏళ్ల క్రితం ఎస్సారెస్పీ ముంపు నిర్వాసితులు కోమన్‌పల్లి, డొంకేశ్వర్, మోతీనగర్‌లోని వ్యవసాయ భూములను అమ్ముకుని పూర్తిగా వేరే చోటికి వెళ్లిపోయారు. వీరికి కేటాయించిన ఇళ్ల స్థలాలను అమ్ముకునే వీలు లేకపోయినప్పటికీ వారు ఆయా స్థలాలను అప్పుడే నామమాత్రపు ధరలకు పేదలు, స్థానికులకు అమ్మి పూర్తిగా వెళ్లిపోయారు.

ఇళ్ల స్థలాలు కొన్న వారికి సమస్యలు

డొంకేశ్వర్, కోమన్‌పల్లి, మోతీనగర్ గ్రామాల్లో పునరావాస గ్రామాల ప్రజలు వెళ్లి పోవడంతో అదే ఇళ్ల స్థలాలను కొన్న దాదాపు 500 కుటుంబాలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వడానికి చట్టపరంగా అడ్డంకులు రావడంతో అదే స్థలంలో ఇళ్లు కట్టుకున్న వారికి విద్యుత్ మీటరు తీసుకోవడం, రేషన్‌కార్డు పొందడం, ఇతర మౌలిక వసతులను గ్రామపంచాయతీ అమలు చేయడానికి సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీంతో వారి ఇళ్లకు కనీసం ఇంటినంబర్లు కేటాయించడం కూడా ఇబ్బందికరంగా మారింది.

జిల్లా కలెక్టర్ హామీతో సమస్య పరిష్కారానికి తుదిరూపం

తాము కొన్న స్థలాల్లో ఇళ్లు కట్టుకున్నా.. వాటికి పట్టాలు లేకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నామని ప్రజావాణిలో ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఈ భూములకు పట్టాలు ఇవ్వడానికి సానుకూలంగా ఉన్నామని, దీనికి లబ్ధిదారులు మీసేవాలో దరఖాస్తు చేయాలని సూచించారు.

జీవో 58, జీవో 59 ద్వారా పట్టాలు

జీవో 58 కింద 125 గజాల వరకు భూమి ఉంటే ఉచితంగా ప్రభుత్వం లబ్ధిదారుడి పేరున పట్టా చేసి ఇస్తుంది. అదే విధంగా 125 నుంచి ఆపైన ఉన్న ఇళ్ల స్థలాలకు దాదాపు నాలుగు గుంటల వరకు నామమాత్రపు రుసుము చెల్లించి పట్టాలు ఇస్తుంది. దీనికి ఆయా గ్రామాల ప్రజలు మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో ఇళ్ల స్థలాల కోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో ఎస్సారెస్పీ ముంపు గ్రామాల్లోని ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

ఏళ్లుగా సమస్య ఎదుర్కొంటున్నాం



చాలా సంవత్సరాలుగా సమస్యను ఎదుర్కొంటున్నాం.. సమస్య తొలగితే చాలా సంతోషంగా ఉంటాం. ఇళ్ల నిర్మాణం చేసుకున్న చోట పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం నుండి లబ్ధి పొందే కార్యక్రమాలకు ఆటంకాలు ఏర్పడేవి. వెంటనే సమస్య పరిష్కరించాలి.
– తొట్ల మంజుల, కోమన్‌పల్లి

ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌కు కృతజ్ఞతలు



ఇళ్ల కింది స్థలాలకు పట్టాలు లేవని పట్టాలు ఇవ్వాలని మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో పాటు ప్రజావాణిలో సమస్య పరిష్కారం కోసం విన్నవించాం.58,59 జీవోల సమస్యకు ముగింపు పలికే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులకు, కలెక్టర్ యాస్మిన్‌భాషాకు కృతజ్ఞతలు.
– సీపతి రమేశ్, సర్పంచ్, కోమన్‌పల్లి

ఉచితంగా వైకుంఠ రథం సేవలు



పెగడపల్లిలో వైకుంఠ రథం

పెగడపల్లి: మండలంతో పాటు పక్క మండలాలకు సైతం ఉచితంగా వైకుంఠ రథం సేవలు అందుబాటులోకి ప్రజలు హర్షిస్తున్నారు. మృతదేహాలను దహన సంస్కారాలకు తరలించేందుకు ఏడాది క్రితం మండలంలోని ఎల్లాపూర్ గ్రామస్తుడు, జెడ్పీటీసీ కాసుగంటి రాజేందర్‌రావు తన తండ్రి కాసుగంటి లక్ష్మీనరసింహారావు జ్ఞాపకార్థం రూ. 10 లక్షల విలువ చేసే వైకుంఠ రథం కొనుగోలు చేసి మండలంలోని నంచర్ల శ్రీరామ ట్రస్టుకు అందజేశారు. పల్లె ప్రగతిలో నిర్మించిన వైకుంఠధామాలు అన్ని గ్రామాలకు దూరంగా ఉన్నాయి. మృతదేహాలను అక్కడికి తరలించాలంటే ఆయా గ్రామాలు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఏడాది క్రితం జెడ్పీటీసీ తన తండ్రి లక్ష్మీనరసింహారావు జ్ఞాపకార్థం వైకుంఠరథాన్ని విరాళంగా అందజేశారు. ఏడాదిగా పెగడపల్లితో పాటు గొల్లపల్లి, మల్యాల, వెల్గటూర్ మండలాల్లో నామమాత్రపు రుసుముతో సేవలందించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వైకుంఠరథం సేవలను ఉచితంగా అందించాలని నిర్ణయించి, వాహన నిర్వహణకు రానుపోనూ అయ్యే ఖర్చును తానే భరించనున్నట్లు జెడ్పీటీసీ ప్రకటించారు. దీంతో ఉచితంగా వైకుంఠ రథం సమకూర్చుతున్న జెడ్పీటీసీ రాజేందర్ రావును మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు అభినందిస్తున్నారు.

గోదావరి మహాహారతి విజయవంతం చేయాలి


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

ధర్మపురి: పట్టణంలో నేడు జరుగనున్న గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ పిల్లి శ్రీనివాస్ తెలిపాడు. మహా హారతి సందర్భంగా ఆదివారం గోదావరిలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి పవిత్రతను కాపాడాలనే గోదావరి వ్యవస్థాపక చైర్మన్ పొల్సాని మురళీధర్‌రావ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 3న బాసరలో ప్రారంభమైన బైక్ ర్యాలీ సోమవారం మండలంలోని దోనూర్ గుండా గోదావరికి చేరుకుంటుందని సాయంత్రం 5 గంటలకు గోదావరిలో మహాహారతి ఉంటుందని తెలిపారు. లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు సంగి నర్సయ్య, ఆకుల శ్రీనివాస్, నరెడ్ల శంకర్, శివలింగు లక్ష్మీనారాయణ, కాశెట్టి హరీశ్ తదితరులున్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

కొండగట్టు: కొడిమ్యాల మండలం కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని హారతి పల్లకి సేవా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోసున సురేందర్ రెడ్డి గౌతమి దంపతులు అన్నదానం చేశారు. సాయిబాబా ఆలయ నిర్వాహక కమిటీ బాధ్యులు గుండెటి రమేశ్, ఏనుగు ఆదిరెడ్డి ఎల్లం శ్రీనివాస్, నారకట్ల మహిపాల్ కొత్తూరి స్వామి అర్చకులు నాగరాజు శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో ఆధార్ జారీకి ప్రత్యేక కౌంటర్

మెట్‌పల్లి: పోస్టాఫీసులో ఆధార్ కార్డ్ జారీకి ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పోస్ట్‌మాస్టర్ నరేశ్ ఆదివారం తెలిపారు. కార్డుల జారీతో పాటు పాత కార్డుల్లో మార్పులు, చేర్పులు కూడా చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మెట్‌పల్లి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'దశాబ్ది ఉత్సవాల్లో ప్రొటోకాల్ పాటించలేదు'

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో ఆదివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని బీజేపీ మండలాధ్యక్షుడు, స్థానిక ఉపసర్పంచ్ అన్నవేని వేణు ఆరోపించారు. ఆదివారం మాట్లాడుతూ గ్రామ ఉపసర్పంచ్‌గా నాకు, వార్డు సభ్యురాలైన తన భార్యకు సైతం సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా నిర్వహించుకున్నారన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గ్రామానికి చేసిన అభివృద్ధి పనులన్నీ కాగితపు లెక్కలేనని మా రెండు వార్డుల్లో ఏలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో కిషాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగళారపు లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు ముత్యంరెడ్డి, నాయకులు తిప్పిరెడ్డి రాజశేఖర్, కోల శంకర్, లక్ష్మీనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.


కథలాపూర్ మోడల్ స్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కథలాపూర్: కథలాపూర్ మోడల్‌స్కూల్‌లో 2020-21 పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థుల సమావేశం ఆదివారం స్థానిక ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట, పాటలతో సందడి చేశారు. సాయంత్రం సామూహికంగా భోజనాలు చేసి మళ్లీ కలుద్దాం మిత్రమా అంటూ ఆటోగ్రాఫ్‌లు తీసుకుని సమావేశాన్ని ముగించేశారు.

కోరుట్ల: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిరం పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణ శివారులోని శివసాయి గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 1987 నుంచి 1998 వరకు శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో చదువుకున్న వారంతా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒకే చోట కలిసి పాత జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకున్నారు. ఆచార్యులనందరిని పిలిచి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు.


శ్రీసరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థులు

కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘాల నాయకులు

కోరుట్ల రూరల్: కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కుల సంఘ భవనాల అభివృద్ధి కోసం సీడీపీ నిధులు రూ.1 కోటి నిధులు మంజూరు కాగా, పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయా గ్రామాల కుల సంఘ నాయకులకు ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని కుల సంఘాలు, కుల వృత్తులను అభివృద్ధి చేయాలనేదే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో కు సంఘ భవనాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంపీపీ తోట నారాయణ, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

బుగ్గారం: మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన చిన్నారి అనన్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, చిన్నారి తల్లిదండ్రులు చికిత్స డబ్బులు లేక మంత్రిని ఆశ్రయించారు. స్పందించిన మంత్రి పాప చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రిలో వైద్యం చేయించడానికి రూ. 2.75 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించి ఆదివారం కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో చిన్నారి కుటుంబ సభ్యులకు పత్రాన్ని అందజేశారు.

రైల్వే ప్రమాద మృతులకు నివాళి

రాయికల్: రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి ఆదివారం బీజేపీ రాయికల్ పట్టణశాఖ ఆధ్వర్యంలో భరతమాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, నాయకులు సామల్ల సతీశ్, భూమేశ్, మోసారపు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సేవాసంఘం నూతన కార్యవర్గం

వెల్గటూర్: గొల్లపల్లి పట్టణ పద్మశాలీ సేవాసంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చౌటుపల్లి తిరుపతి, ఉపాధ్యక్షుడిగా ఎనగందుల శంకర్, ప్రధాన కార్యదర్శిగా అందె లక్ష్మణ్, కోశాధికారిగా అంకం లింబాద్రి ఎన్నికయ్యారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు చౌటుపల్లి తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో అంకం భూమయ్య, గూడూరు రాజయ్య, ధర్మపురి మల్లేశం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

మల్లాపూర్: మండలంలోని సంగెం–శ్రీరాంపూర్ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చెవ్వ లచ్చక్క(60) అనే వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం మల్లాపూర్‌కు చెందిన చెవ్వ లచ్చక్క కూరగాయలు అమ్ముకుంటూ నివసిస్తోంది. ఆదివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కి వెళ్లిన లచ్చక్క కూరగాయలు కొనుగోలు చేసి ఆటోలో తీసుకుని మల్లాపూర్‌కు వెళ్తుండగా, సంగెం–శ్రీరాంపూర్ శివారులోకి చేరుకోగానే ఈదురుగాలులు రావడంతో ఆటోను గేదెలు బలంగా ఢీకొట్టడంతో రోడ్డుపై కిందపడ్డ లచ్చక్కకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108కి సమాచారం ఇవ్వడంతో లచ్చక్కని చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి


కలెక్టర్‌ను కలిసిన సర్పంచ్ సయ్యద్ హైదర్

మల్లాపూర్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆదివారం కలెక్టర్ యాస్మిన్‌బాషాను మల్లాపూర్ మండలం హుస్సేన్‌నగర్ సర్పంచ్ సయ్యద్ హైదర్ నేతృత్వంలోని గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోనే 100 శాతం మైనార్టీలు ఉన్న గ్రామం హుస్సేన్‌నగర్‌ను గత 5 ఏళ్ల క్రితమే గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలో అతిచిన్న గ్రామపంచాయతీగా ఉన్న హుస్సేన్‌నగర్ గ్రామ అభివృద్ధికి నిధులు కూడా తక్కువగానే కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మా గ్రామాభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కలెక్టర్ యాస్మిన్‌భాషాను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ షేక్ సాదుల్లా, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలి

సారంగాపూర్: మండలంలోని మ్యాడారం తండా గ్రామంలో ధాన్యం తూకం పూర్తయినా లారీలు రాకపోవడంతో తూకం వేసిన ధాన్యం అలాగే నిలువ ఉందని వార్డు సభ్యుడు బేర మహేశ్ పేర్కొన్నారు. కేంద్రంలో ప్రస్తుతం వెయ్యి క్వింటాళ్ల ధాన్యం అవుతుందని, అధికారులు లారీలు పంపి కొనుగోళ్లను వెంటనే పూర్తి చేయాలని ఆయన కోరాడు. వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతుందని ధాన్యం తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. అర్పపల్లి కేంద్రంలోనూ ధాన్యం ఇంకా నిల్వ ఉందని ఇక్కడ కూడ కొనుగోళ్లు పూర్తి చేయాలని గ్రామ రైతులు కలెక్టర్‌ను కోరుతున్నారు.

నాలుగు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి

పెగడపల్లి: పెగడపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎత్తివేసినట్లు సీఈవో గోపాల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పెగడపల్లి, మద్దులపల్లి, శాలపల్లి, ఆరవెల్లి కేంద్రాల్లో ధాన్యం నిలువలను తూకం చేసి మిల్లులకు చేర వేశామని, కేంద్రాల్లో ధాన్యం నిల్వ పూర్తి కావడంతో వీటిని ఎత్తి వేసినట్లు పేర్కొన్నారు.

రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నవీన్

రాయికల్: మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఖయ్యూం 40 రోజుల పాటు హజ్ యాత్రకు వెళ్లనుండడంతో జగిత్యాల రూరల్ తహసీల్దార్ నవీన్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

గంగమ్మతల్లికి బోనాలు


పూజలు చేస్తున్న భక్తులు

కథలాపూర్: మండలకేంద్రంలో గంగమ్మతల్లి బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బోనాలతో భక్తులు గ్రామం నుంచి వరదకాలువ ఒడ్డున ఉన్న గంగమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చి, అనంతరం గంగమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏటా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని పూజలు చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం

కథలాపూర్: బీమారం మండలకేంద్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అందుకున్న స్వామివారు రథంపై ఆశీనులయ్యారు. గ్రామంలోని ప్రధానవీధుల గుండా రథోత్సవం జరిగింది. ఈ ఉత్సవాల్లో నాయకులు, యువకులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎమ్మార్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న లోక బాపురెడ్డి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన ఎం.డీ జరీనాకు రూ. 32 వేల సీఎమ్మార్‌ఎఫ్ చెక్కును మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆదివారం అందించారు. బాధితురాలికి వైద్యఖర్చుల కోసం సీఎమ్మార్‌ఎఫ్ మంజూరైందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, రైతు బంధు సమితి అధ్యక్షుడు బద్దం మహేందర్, నాయకులు పూండ్ర జనార్దన్‌రెడ్డి, రామకృష్ణ, ప్రిన్స్‌రెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు


కంటి చికిత్స చేయించుకున్న వారితో ఎమ్మెల్యే

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని పావని కంటి ఆస్పత్రి, ఆపి, రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలైన 13 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, గుంటి రవి, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం


ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్

కథలాపూర్: బీమారం మండలం గోవిందారంలో గోల్డెన్ యూత్ హిందూవాహిని ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేములవాడ నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నీని ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రారంభించారు. ఈ టోర్నీలో 55 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కరండ్ల మధుకర్, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దమ్మన్నపేటలో భగవద్గీత ప్రచారం


భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేస్తున్న సభ్యులు

ధర్మపురి: మండలంలోని దమ్మన్నపేటలో ఆదివారం త్రైత సిద్ధాంత గ్రంథాలను, జ్ఞాన ధర్మ ప్రచారాన్ని చేపట్టారు. జగిత్యాల జిల్లా త్రైతసిద్ధాతకర్త ప్రబోధానంద యోగీశ్వరుల సేవాసమితి వారి ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటా ప్రచారం చేసి గ్రంథాలను పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంత ఆది గురు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు గ్రహీత శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక 100 రకాలైన త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు ఆర్ రాజు, రాకేష్, ఎం రాజు, విక్రమ్ దీక్షిత్, సునీత, రవళి, స్వాతి, ఉమా, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

'చెరువుల పండుగను బహిష్కరించాలి'

జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న నిర్వహించే మృగశిరకార్తె సందర్భంగా చెరువులు, కుంటల వద్ద సంబురాలు చేయాలని పిలుపునిచ్చిందని, దీనిని గంగపుత్రులు బహిష్కరించాలని మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు దేశవేని రాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య సహకార సంఘం ఏర్పడి 1964 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర మత్స్య సహకార సంఘం చైర్మన్‌గా, అధ్యక్షులుగా గంగపుత్రులే కొనసాగుతున్నారని, ప్రభుత్వం మొట్టమొదటిసారిగా ముదిరాజ్ కులస్తులను చైర్మన్ పదవిని కట్టబెట్టారని అన్నారు. గంగపుత్ర జాతికి ప్రభుత్వం తీవ్ర ద్రోహం చేసినందుకు ఈ నెల 8 చీకటి రోజుగా ప్రకటిస్తున్నామని, దశాబ్ది ఉత్సవాలను బహిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పల్లికొండ రాజు, తోపారపు రజనీకాంత్, నారాయణ, కల్లెడ గంగాధర్, నర్సయ్య పాల్గొన్నారు.